ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## ముగిసిన రామోజీరావు అంత్యక్రియలు

పాడె మోసిన చంద్రబాబు

2లో..

సంపుటి: 2 | సంచిక: 60 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 10 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



# మోదీ 3.0

మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం

కేంద్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం



దేశ, విదేశాల నుంచి 8 వేల మంది అతిథులు హాజరు.

మోదీతో పాటు 72 మంది కేంద్ర మంత్రులుగా ప్రమాణం

30 మందికి కేబినెట్ హోదా, ఐదుగురు సహాయ (స్వతంత్ర), 36 మంది సహాయ మంత్రులు



న్యూఢిల్లీ, జూన్ 9 (ప్రభాత ఉదయం): హ్యాట్రిక్ ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని ప్రమాణ స్వీకారానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా.. మరోసారి దేశ ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల నేతలు.. సినీ, క్రీడా, వ్యాపార ప్రముఖులు హాజరయ్యారు. ఇక వివిధ దేశాల అధినేతలు కూడా మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకించేందుకు భారత్ విచ్చేశారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఇటీవలి ఎన్నికల్లో విజయం సాధించిన నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్- ఎన్డీఏ కూటమి ముచ్చటగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక గత 10 ఏళ్లుగా దేశ ప్రధానిగా పనిచేస్తున్న నరేంద్ర మోదీ హ్యాట్రిక్ సాధించి.. మూడోసారి ప్రధాని పీఠాన్ని ..మిగతా 2లో

తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురికి

## కేంద్ర మంత్రి పదవులు



న్యూఢిల్లీ, జూన్ 9 (ప్రభాత ఉదయం): కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి మూడోసారి ముచ్చటగా కొలువు దీరింది. ప్రధానిగా నరేంద్రమోదీ మంత్రి వర్గంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురికి చోటు దక్కింది. సికింద్రాబాద్ నుంచి గెలుపొందిన జీ కిషన్ రెడ్డి, కరీంనగర్ నుంచి ఎన్నికైన బండి సంజయ్, ఆంధ్రప్రదేశ్ నుంచి కింజారపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మలకు చోటు దక్కింది. నరేంద్రమోదీ 2.0 క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న జీ కిషన్ రెడ్డి మినహా అందరూ తొలిసారి కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. 2019 ఎన్నికల్లో తొలిసారి కరీంనగర్ స్థానం నుంచి గెలుపొందిన బండి సంజయ్ కుమార్‌కు సహాయ మంత్రి పదవి లభించింది. తెలంగాణ నుంచి ఇద్దరు బీజేపీ నేతలకే ప్రధాని మోదీ అవకాశం కల్పించారు. 2019 ఎన్నికల్లో గెలుపొందగానే తెలంగాణ బీజేపీ శాఖ అధ్యక్షుడిగా బండి సంజయ్ నియమితులయ్యారు. కానీ, 2023 అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆయనను తప్పించి, కిషన్ రెడ్డికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆంధ్ర ప్రదేశ్ లోని శ్రీకాకుళం లోక్ సభా స్థానం నుంచి మూడోసారి గెలుపొందిన టీడీపీ నేత కింజారపు రామ్మోహన్ నాయుడు కేంద్ర క్యాబినెట్ మంత్రిగా ప్రమాణం చేశారు. టీడీపీ వ్యవస్థాపక నేతల్లో ఒకరైన అచ్చెన్నాయుడు కుమారుడే రామ్మోహన్ నాయుడు. గుంటూరు లోక్ సభ స్థానం నుంచి టీడీపీ తరఫున ఎన్నికైన పెమ్మసాని చంద్రశేఖర్‌కూ సహాయ మంత్రి పదవి లభించింది. పెమ్మరాజు చంద్రశేఖర్ తొలిసారి పార్లమెంట్ కు ఎన్నికయ్యారు. ఇక బీజేపీ అభ్యర్థిగా నర్సాపురం నుంచి గెలుపొందిన భూపతిరాజు శ్రీనివాస వర్మకూ సహాయ మంత్రి హోదా లభించింది. భూపతి రాజు శ్రీనివాస వర్మ కూడా పార్లమెంటుకు ఎన్నికవ్వడం ఇదే తొలిసారి.

## యాత్రికుల బస్సుపై ఉగ్రదాడి

### 10 మంది మృతి



న్యూఢిల్లీ, జూన్ 9 (ప్రభాత ఉదయం): జమ్మూ కాశ్మీర్‌లో టెర్రరిస్టులు బరితెగించారు. ఆదివారం రియాసి జిల్లాలో యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. బస్సు శివఖోడా ఆలయం నుంచి కత్రాకు తిరిగి వస్తుండగా ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు.దాడి జరిగిన వెంటనే పోలీసులు, సైన్యం, పారామిలటరీ బలగాలు ఘటనాస్థలికి చేరుకున్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో బస్సు ఒక్కసారిగా లోయలో పడిపోయింది. అందులో ప్రమాణిస్తున్న ప్రయాణికుల్లో 10 మంది మరణించగా, 33 మంది గాయపడ్డారు. కాల్పుల కారణంగా డ్రైవర్ బస్సుపై కంట్రోల్ ..మిగతా 2లో




## కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం

శ్రీనగర్, జూన్ 9 (ప్రభాత ఉదయం): జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ కసరత్తు ప్రారంభించింది. ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ..మిగతా 2లో

## బీజేపీ అధ్యక్ష పదవి మార్పు... తెలంగాణలో ఈటలకు బాధ్యతలు!



న్యూఢిల్లీ, జూన్ 9 (ప్రభాత ఉదయం): కేంద్రంలో, రాష్ట్రాల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మోదీ 3.0 పాలన ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కేంద్ర కేబినెట్‌లోకి బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ జాతీయ, తెలంగాణ అధ్యక్షుల బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారన్న చర్చ జోరుగా సాగుతోంది... తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించింది. భారతీయ జనతా పార్టీ అత్యధిక ఎంపీ సీట్లు గెలుచుకొని.. కూటమిలో తొలి అతిపెద్దగా పార్టీ స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. నరేంద్ర మోదీ మూడోసారి ..మిగతా 2లో

# మోదీ 3.0



మొదటి పేజీ తరువాయి...

అధిష్ఠించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రధానమంత్రితోపాటు మరో 71 మంది కూడా కేంద్రమంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురికి చోటు దక్కింది.తెలంగాణ నుంచి సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌లకు మోదీ కేబినెట్‌లో చేరారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి టీడీపీ తరఫున శ్రీకాకుళం నుంచి గెలిచిన కింజరపు రాంమోహన్ నాయుడు.. గుంటూరు నుంచి విజయం సాధించిన పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు కేంద్రమంత్రి పదవులు దక్కాయి.

### హ్యాట్రిక్ ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం.. దద్దరిల్లిన రాష్ట్రపతి భవన్

నరేంద్ర మోదీ తర్వాత రాజ్‌నాథ్ సింగ్ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌నాథ్ సింగ్ తర్వాత అమిత్ షా కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. అమిత్ షా తర్వాత నితిన్ గడ్కరీ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. నితిన్ గడ్కరీ తర్వాత జేపీ నడ్డా కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. బీజేపీ జాతీయాధ్యక్షుడైన జేపీ నడ్డా.. మోదీ తొలి కేబినెట్‌లో 2014-19 మధ్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2020లో అమిత్ షా స్థానంలో ఆయన బీజేపీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. జేపీ నడ్డా తర్వాత శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌ను సైతం మోదీ కేబినెట్లోకి తీసుకున్నారు. 2023 వరకు ఆయన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. గత ఏడాది జరిగిన ఎన్నికల తర్వాత ఆయన్ను బీజేపీ అధినాయకత్వం మరోసారి సీఎంగా ఎంపిక చేయలేదు. ఎంపీగా పోటీ చేయకున్నా నిర్మలా సీతారామన్ మళ్లీ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నిర్మలా సీతారామన్ 2019 నుంచి 2024 వరకు కేంద్ర ఆర్థిక మంత్రిగా వ్యవహరించారు. 2014 నుంచి 2017 వరకు ఆమె సహాయక మంత్రిగా పని చేశారు. 2017 నుంచి 2019 వరకు రక్షణ మంత్రిగా నిర్మల సేవలందించారు. సుబ్రహ్మణ్యం జై శంకర్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. సుబ్రహ్మణ్యం జై శంకర్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లపాటు ఆయన విదేశాంగ శాఖ మంత్రిగా వ్యవహరించారు. మరోసారి కూడా ఆయనకు విదేశాంగ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. హర్యానా మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కర్ణాటక మాజీ సీఎం, జేడీఎస్ నేత కుమారస్వామి కేంద్రమంత్రిగా ప్రమాణం చేపట్టారు. బీజేపీ నేతల తర్వాత కర్ణాటకకు చెందిన జేడీఎస్ నేత కుమారస్వామి మంత్రిగా ప్రమాణం చేశారు. దక్షిణాదికి చెందిన ఆయన హిందీలో కాకుండా ఇంగ్లీష్‌లో ప్రమాణం చేశారు. కుమారస్వామి తండ్రి హెచ్‌డీ దేవేగౌడ గతంలో భారత ప్రధానిగా పని చేశారు. పీయూష్ గోయల్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్రమంత్రిగా జితిన్ రామ్ మాంఝీ ప్రమాణం చేశారు. లలన్ సింగ్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా సర్బానంద సోనోవాల్ ప్రమాణ స్వీకారం చేశారు. వీరేంద్ర కుమార్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. టీడీపీ తరఫున శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రహ్లాద్ జోషి కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా జోయల్ ఓరమ్ ప్రమాణ స్వీకారం చేశారు. గిరిరాజ్ సింగ్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా అశ్వినీ వైష్ణవ్ ప్రమాణం చేశారు. జ్యోతిరాధిత్య సింధియా కేంద్రమంత్రిగా ప్రమణ స్వీకారం చేశారు. కేంద్రమంత్రిగా భూపేంద్ర యాదవ్ ప్రమాణం చేశారు. అన్నపూర్ణ దేవి కేంద్రమంత్రిగా ప్రమ్షాణ స్వీకారం చేశారు. కేంద్రమంత్రిగా కిరణ్ రిజిజు ప్రమాణం చేశారు. హర్దీప్ సింగ్ పూరీ కేంద్రమంత్రిగా ప్రమాణం చేపట్టారు. కేంద్రమంత్రిగా మన్సుఖ్ మాండవీయ ప్రమాణ స్వీకారం చేశారు. జి. కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. 2019 లోనే తొలిసారి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కిషన్ రెడ్డికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా అవకాశం వచ్చింది. ఆ తర్వాత కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా విధులు నిర్వర్తించారు. కేంద్రమంత్రిగా గజేంద్ర సింగ్ షెకావత్ ప్రమాణం చేశారు. ఎల్‌జేపీ నేత చిరాగ్ పాశ్వాన్ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్రమంత్రిగా సీఆర్ పాటిల్ ప్రమాణం చేశారు. ఇందర్ జీత్ సింగ్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా అర్జున్ రామ్ మేఘవాల్ ప్రమాణ స్వీకారం చేశారు. జితేంద్ర సింగ్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. శివసేన పార్టీకి చెందిన ప్రతాప్‌రావ్ గణపతి రావ్ జాదవ్ ప్రమాణం చేశారు. శ్రీపాద యశోనాయక్ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధినేత జయంత్ చౌదరీ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా పంకజ్ చౌదరీ ప్రమాణం చేశారు. రామ్‌దాస్ అథవాలే కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. జితిన్ ప్రసాద కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా నిత్యానంద రాయ్ ప్రమాణ స్వీకారం చేశారు. అప్నాదళ్ పార్టీ నాయకురాలు అనుప్రియ పటేల్ ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా వి. సోమన్న ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ తరఫున గుంటూరు నియోజకవర్గం నుంచి గెలుపొందిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్.. కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా ఎస్పీ సింగ్ బఘేల్ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. బీఎల్ వర్మ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా క్రిషన్ పాల్ ప్రమాణ స్వీకారం చేశారు. శోభ కరంద్లాజే కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా శాంతను ఠాకూర్ ప్రమాణ స్వీకారం చేశారు. క్రితి వర్ధన్ సింగ్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా కేరళ నుంచి గెలిచిన ఒకే ఒక్క బీజేపీ ఎంపీ, నటుడు సురేష్ గోపి ప్రమాణ స్వీకారం చేశారు. ఎల్. మురుగన్ కేంద్రమంత్రిగా ప్రమాణం చేశారు. కేంద్రమంత్రిగా అజయ్ టంటా ప్రమాణ స్వీకారం చేశారు. కరీంనగర్ నుంచి విజయం సాధించిన బండి సంజయ్ కుమార్ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

### రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్న ప్రముఖులు.. విదేశీ ప్రముఖులు

మాల్దీవులు అధ్యక్షుడు మహ్మద్ మయిజ్జు రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరయ్యారు. నేపాల్ ప్రధాని పుష్ప కమాల్ ప్రచండ.. మోదీ ప్రమాణ స్వీకారానికి విచ్చేశారు. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ సింఘే కార్యక్రమంలో పాల్గొన్నారు. మారిషస్ ప్రధానమంత్రి ప్రవింద్ జుగ్నాథ్ చేరుకున్నారు.

### దేశంలోని ప్రముఖులు

బీజేపీ కురువృద్ధుడు మురళీ మనోహర్ జోషి రాష్ట్రపతి భవన్ చేరుకున్నారు. తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరయ్యారు. బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్.. మోదీ ప్రమాణ స్వీకారానికి విచ్చేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ పాల్గొన్నారు. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ రాష్ట్రపతి భవన్ చేరుకున్నారు.

### కీలక శాఖలు బీజేపీ వద్దే!

ఈ ఎన్నికల్లో సొంతంగా మెజార్టీ మార్కు అందుకోని బీజేపీకి మిత్రపక్షాల మద్దతు అవసరం అయింది. ఈ నేపథ్యంలోనే కూటమిలో టీడీపీ, జేడీయూ వంటి పార్టీలు కీలకంగా మారాయి. దీంతో ఆ పార్టీలు కీలక పదవులపై కన్నేసిన నేపథ్యంలో నరేంద్ర మోదీ మాత్రం కీలక శాఖలను తమ పార్టీ ఎంపీల వద్దే ఉంచేలా పావులు కదుపుతున్నారు. కేంద్ర ప్రభుత్వంలో కీలక శాఖలైన హోం శాఖ, రక్షణ శాఖ, ఆర్థిక శాఖ, విదేశీ వ్యవహారాల శాఖలను తమ వద్దే ఉంచుకుని.. కూటమిలోని పార్టీలకు మిగితా శాఖలను కేటాయించనున్నారు.

### అమిత్ షా, రాజ్‌నాథ్, గడ్కరీ, జైశంకర్‌లకు పాత శాఖలే!

నరేంద్ర మోదీ 3.0 లో బీజేపీ అగ్రనేతలకు మళ్లీ అవే శాఖలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. రక్షణ శాఖకు రాజ్‌నాథ్ సింగ్‌ను మరోసారి మంత్రిగా ఉంచనున్నారు. అమిత్ షాకు హోం శాఖ, నితన్ గడ్కరీకి రోడ్డు రవాణా శాఖ, జైశంకర్‌కు విదేశీ వ్యవహారాల శాఖలను కేటాయించనున్నరు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న నిర్మలా సీతారామన్‌ను కూడా తిరిగి మంత్రివర్గంలోకి మోదీ తీసుకున్నారు.

## ఆల యువ ఉద్యోగ యాప్‌ని సద్వినియోగం చేసుకోవాలి

### విద్యార్థి నాయకుడు గాడిల నవీన్



కొత్తకోట, జూన్9(ప్రభాత ఉదయం)ఆల యువ ఉద్యోగ యాప్‌ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థి నాయకుడు గాడిల నవీన్ కోరారు. దేవరకద్ర నియోజకవర్గంలోని యువతపై అపారమైన ప్రేమతో, రాజకీయాలకు అతీతంగా లక్షల రుపాయలతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆలన్న ఉద్యోగ యాప్ ని 2023 యాప్ వ్యూహకర్త చక్రవర్తి ద్వారా రూపకల్పన చేసారన్నారు. యాప్ ద్వారా ఇప్పటి వరకు 6,000 పైగా విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు, ఇంకా చాలా మంది ఈ యాప్ ని సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్ర స్థాయి పోటీ పోటీ పరీక్షలకు ఈ యాప్ చాలా ఉపోయోగ పడుతుందన్నారు.


## సోమవారం నుండి ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ



గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9(ప్రభాత ఉదయం) ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తిరిగి జూన్, 10వ తేదీ (సోమవారం) నుండి నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గత కొన్ని వారాలుగా ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయడం జరిగినందున, తిరిగి యధా విధంగా ఈరోజు సోమవారం నుండి ఉదయం 10:30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలందరూ ఇట్టి కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు అందరు సకాలంలో పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## మోదీ కేబినెట్‌లో ఎన్సీపీకి మొండిచేయి

### కొన్ని రోజులు ఎదురుచూస్తామన్న అజిత్ పవార్



ముంబై, జూన్ 9 (ప్రభాత ఉదయం): మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవర్ నేతృత్వంలోని ఎన్సీపీకి మోదీ కొత్త కేబినెట్‌లో మొండిచేయి ఎదురైంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి గెలిచిన ఒక్క ఎంపీ ప్రఫుల్ పటేల్‌కు కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని అజిత్ పవార్ డిమాండ్ చేశారు. అయితే కొత్త కేబినెట్‌లోకి ఆయనను తీసుకోలేదు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులు వేచి ఉంటామని అజిత్ పవార్ అన్నారు. ఆదివారం ఈ అంశంపై మీడియాతో ఆయన మాట్లాడారు. తమ పార్టీకి కేంద్ర సహాయ మంత్రి పదవిని ఆఫర్ చేశారని తెలిపారు. అయితే కేబినెట్ పోస్ట్ మాత్రమే తమకు కావాలని చెప్పామన్నారు. దీని కోసం కొన్ని రోజులు ఎదురుచూస్తామని చెప్పారు. 'మాకు ఇవాళ ఒక లోక్‌సభ, ఒక రాజ్యసభ ఎంపీ ఉన్నారు. రానున్న రెండు మూడు నెలల్లో రాజ్యసభలో ముగ్గురు సభ్యులు మాకు ఉంటారు. పార్లమెంటులో మా ఎంపీల సంఖ్య నాలుగు అవుతుంది. కాబట్టి మాకు ఒక కేబినెట్ మంత్రిత్వ శాఖ సీటు ఇవ్వాలని అడిగాం' అని అన్నారు. మరోవైపు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ కూడా ఈ అంశంపై మీడియాతో మాట్లాడారు. ఎన్సీపీ (అజిత్ పవార్)కు ఎంవోఎస్ (సహాయ మంత్రి) పదవిని ఆఫర్ చేసినట్లు చెప్పారు. అయితే ఆ పార్టీ కేబినెట్ బెర్త్ కావాలని పట్టుబట్టిందని అన్నారు. మంత్రివర్గ విస్తరణలో కేబినెట్ బెర్త్ పొందేందుకు ఎన్సీపీ అంగీకరించిందని ఫడ్నవీస్ వెల్లడించారు.

## బీజేపీ అధ్యక్ష పదవి మార్పు తెలంగాణలో ఈటలకు బాధ్యతలు!

మొదటి పేజీ తరువాయి...

ప్రధాని పీఠం అధిరోహించారు. ఇప్పటివరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను మోదీ మంత్రివర్గంలోకి తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ అధ్యక్ష పదవి నుంచి ఆయన తప్పుకోనున్నారు. మరి కొత్త అధ్యక్షుడిగా ఎవరికి పగ్గాలు అప్పగిస్తారన్నది వేచిచూడాలి. ఇక తెలంగాణలోని 17 పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 8 స్థానాలను భారతీయ జనతా పార్టీ గెలుచుకుంది. కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్న కిషన్ రెడ్డి (సికింద్రాబాద్)తో పాటు బండి సంజయ్ (కరీంనగర్), రఘునందన్ రావు (మెదక్), ఈటల రాజేందర్ (మల్కాజిగిరి), ధర్మపురి అరవింద్ (నిజామాబాద్), గోడం నగేశ్(ఆదిలాబాద్), కొండా విశ్వేశ్వర్ రెడ్డి (చేవెళ్ల), డీకే అరుణ (మహబూబ్ నగర్) ఎంపీలుగా విజయం సాధించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మరోసారి మోదీ కేబినెట్‌లో చోటు దక్కింది. దీంతో తెలంగాణ అధ్యక్ష బాధ్యతలను వేరొకరికి అప్పగించాలని పార్టీ అధిష్టానం యోచిస్తోంది. బండి సంజయ్‌ని సైతం కేంద్ర కేబినెట్‌లోకి ఆహ్వానించిన నేపథ్యంలో సీనియర్ నాయకుడిగా ఉన్న ఈటల రాజేందర్‌కు తెలంగాణ బీజేపీ పగ్గాలు అందించబోతున్నట్లు చర్చ జరుగుతోంది. ఈటల రాజేందర్ తెలంగాణలో మంచి పట్టున్న నేత. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేశారు. 3 లక్షల 91వేల పైచిలుకు భారీ మెజారిటీతో లోక్ సభకు ఎన్నికయ్యారు. అయితే, తొలుత ఈటలకు కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కుతుందని తొలుత అంతా భావించారు. అనూహ్యంగా మారిన పరిణామాల నేపథ్యంలో తెలంగాణ నుంచి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్ర క్యాబినేట్‌కు ఎంపికయ్యారు. ఈటలతో పాటు డీకే అరుణ, ధర్మపురి అరవింద్‌కు కూడా కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కుతుందన్న వార్తలు వినిపించినా అలా జరగలేదు. కిషన్ రెడ్డి రెండోసారి కేంద్ర మంత్రి పదవి చేపట్టబోతున్న నేపథ్యంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

ఉన్నట్టు తెలుస్తున్నది. ఆగస్టులో ఎన్నికలు పూర్తి చేయాలనే ఆలోచనతో ఈసీ ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎన్నికలు నిర్వహించేందుకు వాతావరణ పరిస్థితులు అంతగా అనుకూలంగా ఉండవు. అయితే, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కశ్మీర్ ప్రజలు ఓట్లు వేసేందుకు ఉత్సాహం చూపారు. కశ్మీర్ వ్యాలీలో 51.05 ఓటింగ్ శాతం నమోదైంది. గత మూడునాలుగు దశాబ్దాల్లో ఈసారే కశ్మీర్‌లో ఎన్నికలు అత్యంత ప్రశాంతంగా జరిగాయి. ప్రజలు ఓటింగ్‌కు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఎన్నికలు ఇప్పుడే నిర్వహించాలని ఈసీ భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే గుర్తింపు పొందని రిజిస్టర్డ్ పార్టీలు ఎన్నికల గుర్తులకు దరఖాస్తు చేసుకోవాలని ఈసీ ఆహ్వానించింది. కాగా, గతంలో జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో 107 స్థానాలు ఉండగా ఇప్పుడు 114కు పెరిగాయి. వీటిలో 24 సీట్లు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉండగా మిగతా 90 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిల్లో జమ్ము ప్రాంతంలో 43 స్థానాలు, కశ్మీర్ వ్యాలీలో 47 స్థానాలు ఉన్నాయి.

## ముగిసిన రామోజీరావు అంత్యక్రియలు

### పాడె మోసిన చంద్రబాబు

హైదరాబాద్, జూన్ 9 (ప్రభాత ఉదయం): రామోజీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ రామోజీ రావు అంత్యక్రియలు ముగిశాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో రామోజీ ఫిల్మ్ సిటీలోని స్మృతి వనంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. రామోజీరావు కుమారుడు కిరణ్ అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, రామోజీ గ్రూపు కంపెనీల ఉద్యోగులు, ప్రజలు రామోజీరావుకు వీడ్కోలు పలికేందుకు తరలివచ్చారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. రామోజీని చంద్రబాబు పాడారు. రామోజీ అంత్యక్రియలను ఆయన కుటుంబ సభ్యులు పూర్ణ లాంఛనాలతో నిర్వహించారు. రామోజీ అంతిమ యాత్రలో పాల్గొన్న చంద్రబాబు ఉద్వేగానికి లోనయ్యారు. రామోజీని పాడి చంద్రబాబు తన గౌరవాన్ని చాటుకున్నారు. రామోజీ మరణానంతరం పలువురు సినీ ప్రముఖులు ఫిల్మ్ సిటీకి వచ్చి రామోజీకి నివాళులర్పించారు. రామోజీ సేవలను ప్రధాని మోదీ కొనియాడారు. రామోజీ గ్రూపు సంస్థల ఉద్యోగులు, ప్రజలు తరలివచ్చారు. కుటుంబ సభ్యులు చివరి సారిగా కన్నీటి వీడ్కోలు పలికారు. పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ లాంఛనాలతో రామోజీ అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రామోజీరావు స్మారక చిహ్నాన్ని సిద్ధం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలోని సువిశాల ప్రాంతంలో ఆయన నిర్మించిన స్మారకం వద్ద అంత్యక్రియలు జరిగాయి. కాగా, రామోజీ మృతికి ఏపీ ప్రభుత్వం రెండు రోజుల సంతాప దినాలు ప్రకటించింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పలువురు వారిని ఓదార్చడం కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. రామోజీ అంత్యక్రియల్లో పాల్గొన్న అనంతరం ఢిల్లీలో జరిగే మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి చంద్రబాబు హాజరుకానున్నారు.

## యాత్రికుల బస్సుపై ఉగ్రదాడి

మొదటి పేజీ తరువాయి...

కోల్పోవడంతో బస్సు లోయలో పడిందని రియాసీ ఎస్పీ మోహిత శర్మ తెలిపారు. పొరుగున ఉన్న పూంచ్, రాజౌరిలతో పోలిస్తే రియాసీ జిల్లాలో ఉగ్రవాదుల కార్యకలాపాలు చాలా తక్కువ, అయినప్పటికీ ఈ దాడి జరిగింది. ప్రయాణికుల గుర్తింపు ఇంకా ధ్రువీకరించలేదు. మరణించిన వారు స్థానికులు కాదని తెలుస్తోంది. భద్రతా బలగాలు ఘటన స్థలంలో దర్యాప్తు ప్రారంభించాయి. ఈ ఘటనపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. ఈ దాడిని ఆయన ఖండించారు. ఉద్దేశపూర్వకంగా మన జాతీయ భద్రతకు భంగం కలిగిస్తున్నారని అన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై బీజేపీ ప్రభుత్వానిది అసత్యప్రచారమే అని, ప్రస్తుతం మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం బోలుగా ఉందని విమర్శించారు.

## 'గ్రూప్-4' ఫలితాలు విడుదల

### సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైంది వీరే

హైదరాబాద్, జూన్ 9 (ప్రభాత ఉదయం): తెలంగాణలో గ్రూప్-4 పోస్టుల భర్తీకి సంబంధించి ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను పబ్లిక్ సర్వీస్ కమిషన్ జూన్ 9న విడుదల చేసింది. అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థుల హాల్‌టికెట్ నెంబర్లను అందుబాటులో ఉంచింది. అభ్యర్థులకు మొత్తం 23,999 మంది అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులు జూన్ 13 నుంచి వెబ్‌ఆప్షన్లు నమోదుకు అవకాశం కల్పించింది. అభ్యర్థులు తప్పనిసరిగా వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని కమిషన్ సూచించింది. ఆప్షన్లు ఇచ్చుకున్న వారిని మాత్రమే ధ్రువపత్రాల పరిశీలనకు అనుమతిస్తామని టీజీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూలును త్వరలోనే వెల్లడించనున్నట్లు కమిషన్ స్పష్టంచేసింది. అభ్యర్థులు పరిశీలన కోసం అవసరమైన అన్ని పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అభ్యర్థులకు సూచించింది.

సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు ఇవి అవసరం..

1) వెబ్‌సైట్‌లో సూచించిన ప్రకారం చెక్ లిస్ట్ (1 సెట్) ఉండాలి.
2) దరఖాస్తు సమయంలో సమర్పించి అప్లికేషన్ ఫామ్ (పీడీఎఫ్) ప్రింట్ కాపీ
3) పరీక్ష హాల్‌టికెట్
4) పుట్టినతేదీ ధ్రువీకరణ కోసం పదోతరగతి మార్కుల మెమో.
5) 1 నుంచి 7వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్లు లేదా ప్రైవేట్/ఓపెన్ స్కూల్‌లో చదివిన అభ్యర్థులైతే రెసిడెన్స్/స్థానికత సర్టిఫికేట్ ఉండాలి.
6) డిగ్రీ లేదా పీజీ ప్రొవిజినల్/ కాన్వొకేషన్ సర్టిఫికేట్, మార్కుల మెమో.
7) ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ క్యాస్ట్ సర్టిఫికేట్ (అందులో తల్లిదండ్రుత పేర్లు తప్పనిసరిగా ఉండాలి).
8) బీసీ వర్గానికి చెందినవారైతే నాన్-క్రీమిలేయర్ సర్టిఫికేట్ ఉండాలి. ఇతర బీసీ సర్టిఫికేట్లు అంగీకరించరు.
9) రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులగుతై వయోపరిమితి సడలింపు కోసం సర్వీస్ సర్టిఫికేట్/NCC% ఇన్‌స్ట్రక్టర్/ఎక్స్-సర్వీస్‌మెన్ సర్టిఫికేట్/ సెన్సస్ సర్వీస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
10) పీహెచ్ సర్టిఫికేట్ (SADERAM సర్టిఫికేట్).
11) ఇన్-సర్వీస్ అభ్యర్థులైతే NOC తప్పనిసరి.
12) గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేసిన రెండు సెట్ల అటెస్టేషన్ సర్టిఫికేట్ కాపీలు ఉండాలి.
13) నోటిఫికేషన్ సమయంలో పేర్కొన్న అన్ని ఇతర సర్టిఫికేట్లు తీసుకురావాలి.
14) మూడు ఫొటోలు
15) నిరుద్యోగులు, హిందువులు అయితే డిక్లరేషన్ (పోస్ట్ కోడ్ 70కి) ఇవ్వాలి.

తెలంగాణలో మొత్తం 8,180 గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి జులై 1న రాతపరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 80 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పేపర్-1కు 7,62,872 మంది, పేపర్-2కు 7,61,198 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రిలిమినరీ పరీక్ష ఆన్సర్ 'కీ'ని టీఎస్‌పీఎస్సీ ఆగస్టు 28న విడుదల చేసింది. ఆన్సర్ కీలో అభ్యంతరాలు తెలియజేసేందుకు ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4 అవకాశం కల్పించింది. అనంతరం అక్టోబరు 6న ఫైనల్ కీని టీఎస్‌పీఎస్సీ విడుదల చేయగా.. పలు మార్పులు చోటుచేసుకున్నాయి.

గ్రూప్-4 అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితాలను ఫిబ్రవరి 9న కమిషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. మహిళలకు సమాంతర రిజర్వేషన్ల నేపథ్యంలో 8,180 గ్రూప్-4 ఉద్యోగాల ప్రకటన (నోటిఫికేషన్ నెం.19/2022)కు సవరణ ఖాళీల జాబితా (Revised Breakup)ను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. గ్రూప్-4 భర్తీలో రోస్టర్ విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. కొత్త రోస్టర్ విధానం, మహిళలకు రోస్టర్ పాయింట్ లేకుండా ఖాళీల వివరాలను అందుబాటులో ఉంచారు. గతంలో విధించిన రోస్టర్ విధానాన్ని ఉపసంహరించారు. జిల్లాలవారీగా కేటాయించిన ఉద్యోగ వివరాల జాబితాను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది.

## వాతావరణ మార్పులకు అనుగుణంగ

# రైతులను చైతన్యవంతం చేయాలి



వ్యవసాయ సదస్సులో మాట్లాడుతున్న నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస రావు



అరిబండి లక్ష్మీనారాయణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వివిధ రంగాల ప్రముఖులు

### అరిబండి లక్ష్మీనారాయణ స్మారకోపన్యాసంలో నార్మ్ డైరెక్టర్ సి.హెచ్. శ్రీనివాసరావు

బుద్వేల్, జూన్ 9 (ప్రభాత ఉదయం): వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతాంగాన్ని ప్రభుత్వాలు చైతన్యం చేయాలని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్మెంట్ ( నార్మ్) డైరెక్టర్ డాక్టర్ సి. హెచ్. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వాటర్ టెక్నాలజీ అడిటోరియంలో ఆదివారం అరిబండి ప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన అరిబండి లక్ష్మినారాయణ స్మారకోపన్యాసం లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారత వ్యవసాయం దాదాపు 70 శాతం గ్రామీణ జనాభాకు ఆలంబనగా ఉంది. జాతీమ స్థూల ఉత్పత్తిలో ఈ రంగ భాగం 17 శాతం, పని చేసే వారిలో దాదాపు 55శాతం మంది ఉన్నారన్నారు. 2023 - 24లో జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం నుండి దాదాపు 20 శాతం గా ఉందన్నారు. భారత వ్యవసాయం నిర్మాణ మార్పులకు లోనౌతుందన్నారు. ఈ నిర్మాణ మార్పులు వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను తగ్గించడం వల్ల కాక భారత ఆర్థిక వ్యవస్థలో సేవ, ఉత్పత్తి రంగాలు వేగంగా విస్తరించడం వల్ల నిర్మాణపర మార్పులు వస్తున్నాయన్నారు. 2000 - 10 మధ్య కాలంలో ఈ మార్పులు వేగంగా ఉన్నాయన్నారు. . భారత జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం యొక్క భాగస్వామ్యం వ్యవసాయ రంగ ఆరోగ్యం మీద, మొత్తంగా చూస్తే, భారత ఆర్థిక వ్యవస్థ మంచి చెడ్డలకు ఒక సూచికలాంటిదన్నారు. రాష్ట్ర వ్యవసాయ ప్రణాళికను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు. పి. జంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోకి రుతు పవనాలు ప్రవేశించాయని, వ్యవసాయ పనులు ముమ్మరంగా ప్రారంభమైనాయన్నారు. విత్తనాల కోసం రైతులు అనేక జిల్లాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారని, నకిలీ విత్తనాలు పట్టుబడుతున్నాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏడు పంటలకు బోనస్ ఇవ్వాలని, రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.7,500లు రైతు భరోసా ఇవ్వాలని, పంటల బీమా పథకాన్ని రైతాంగానికి ఉపయోగపడే విధంగా మార్చాలని కోరారు. రాష్ట్రానికి అవసరమైన పంటలకు నిర్దిష్ట ప్రణాళిక రూపొందించి కేరళ తరహాలో పండ్లు, కూరగాయలకు మద్దతు ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ పరిశోధన సంచాలకులు ప్రొఫెసర్ డి. రాజిరెడ్డి మాట్లాడుతూ, వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని పంటల విధానంలో మార్పులు చేయాలని కోరారు. భూముల సారాన్ని బట్టి పంటల విధానాన్ని రూపొందించాలని కోరారు. మాజీ శాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, అరిబండి లక్ష్మీనారాయణ స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై పోరాటాలకు సన్నద్ధమౌతామని, ప్రభుత్వాలు రైతుల అనుకూల విధానాలను అనుసరించకపోతే తగిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మాల్లారెడ్డి మాట్లాడుతూ, రైతు సంఘం కార్యకర్తలు గ్రామాలలో రైతులను చైతన్యవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. డాక్టర్ కిరణ్‌బాబు అధునిక టెక్నాలజీని రైతులు ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. ప్రొఫెసర్ ఉమాదేవి రైతులు ఖర్చులను ఏ విధంగా తగ్గించుకోవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి డి.జి. నర్సింహ్మారావు, అరిబండి ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ మనోహర్, కోశాధికారి డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ లావణ్య, ఐఏఎస్ అధికారి ఎ. వేణుప్రసాద్, పి.వి. అమరనాథ్ ప్రసాద్, డాక్టర్ ఎ. రమేష్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి, మాదినేని రమేష్, మాటూరి బాల్‌రాజ్‌గౌడ్, బి. మధుసుదన్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మూడ్ శోభన్, బొంతు రాంబాబు, బుర్రి శ్రీరాములు, సత్యనారాయణ, నున్న నాగేశ్వర్‌రావు, బాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సారంపల్లి భాగ్యలక్ష్మి, తిరుపతిరెడ్డి, అశోక్, రాంచందర్, పుల్లయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




శ్రీ నికేతన్ హై స్కూల్ లో 2004 -05 లో చదివిన పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బుద్వేల్, జూన్9(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ రాంబాగ్ శ్రీ నికేతన్ హై స్కూల్ ఆదివారం లో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ నికేతన్ హై స్కూల్ లో 2004 - 2005 బ్యాచ్ లో చదువుకున్న విద్యార్థులు, అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు సమావేశం అయ్యారు. విద్యార్థులంతా 20 సంవత్సరాల తర్వాత కలవడం చాలా ఆనందకరంగా అనిపించిందన్నారు. విద్యార్థులు 20 సంవత్సరాల తర్వాత ప్రతి ఒక్క విద్యార్థి వివిధ రంగాలలో స్థిర పడటం పట్ల ఉపాధ్యాయులు చూసి చాలా ఆనందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు




## జేఈఈ అడ్వాన్స్‌లో ప్రతిభ కనబరిచిన

# గిరిజన బాలుర ఐఐటి స్టడీ సెంటర్ విద్యార్థులు



బాణోత్ చందూలాల్



బాణోత్ భద్ర



కె. వినోద్



జి. శ్రీ హర్ష



బాణోత్ తరుణ్



వి. సంతోష్



డి. స్టీఫెన్



ఎ. రాహుల్

బుద్వేల్, జూన్9(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లోని గిరిజన బాలుర ఐఐటి స్టడీ సెంటర్ విద్యార్థులు ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో సత్తా చాటారు. కళాశాలకు చెందిన 63 మంది విద్యార్థులు జే ఈ ఈ అడ్వాన్స్ పరీక్షలు రాయగా, అందులో 50 మంది విద్యార్థులు ఐఐటి గిరిజన కేటగిరి విభాగంలో ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగరవేశారు. వీరిలో బాణోత్ చందులాల్ 291 వ ర్యాంకు సాధించాడు. బి భద్ర 295, కె. వినోద్ 338, గట్టు శ్రీహర్ష 625, బానోత్ తరుణ్ 625 వ ర్యాంకులు సాధించి అందరికన్నా ముందు నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ గట్టు సురేందర్ తెలిపారు

**1000 ర్యాంకు లోపు 12మంది విద్యార్థులు :**

1000 లోపు ర్యాంకులను 12 మంది విద్యార్థులు సాధించారు వారిలో వి సంతోష్ 812, డి స్టీఫెన్ 887, కే విశాల్ 930, బి రాజ్ కుమార్ 936, ఎన్. రమేష్ నాయక్ 936, ఎ. రాహుల్ 946, డి పవన్ 973, బి ఈశ్వర్ 1150 , సి రాఘవేంద్ర 1617 , వి భువన్ 1773, కె. రవి 4,347 ఎం కీర్తన్ నా 5, 483 వ ర్యాంకులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారికి విద్యా బోధన అందించిన అధ్యాపకులను గిరిజన గురుకులాల ఉన్నతాధికారులు అభినందించారు.



ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలుపుతున్న షేక్ రియాజ్

## అసదుద్దీన్ ఒవైసీకి శుభాకాంక్షలు

బుద్వేల్, జూన్9(ప్రభాత ఉదయం): హైదరాబాద్ ఎంపీగా ఐదవ సారి ఎన్నికైన మజ్లీస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ని ఆదివారం రాజేంద్రనగర్ డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్‌లో మజ్లిస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజల తో పాటు రాజ్యాంగాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరిని కలుపుకొని మజ్లీస్ పార్టీని వారిలోకి తీసుకు వెళ్లాలన్నారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాల విద్యార్థులకు ఈనెల 11న లక్కీడిప్



గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9(ప్రభాత ఉదయం)బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను ఈనెల 11న ఉదయం 10:30 గంటలకు ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని శ్వేతా ప్రియదర్శిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంకుగాను ఒకటవ తరగతి (నాన్ రెసిడెన్షియల్) 57 సీట్లు, ఐదవ తరగతి (రెసిడెన్షియల్) 59 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ తప్పక హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.



జి. కిషన్ రెడ్డితో వై శ్రీధర్



బండి సంజయ్ ను సన్మానిస్తున్న వై. శ్రీధర్

## కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు శుభాకాంక్షలు

బుద్వేల్, జూన్9(ప్రభాత ఉదయం) : కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి కిషన్ రెడ్డి , బండి సంజయ్ లకు బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు. వారి నాయకత్వంలో Unblock రాష్ట్రంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధుల కేటాయింపులో కూడా అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు.

# పొదుపు సంఘాలతో ఆర్థిక పురోభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



పాలక మండలి సభ్యులు

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

బుద్వేల్, జూన్9(ప్రభాత ఉదయం):ప్రతి ఒక్కరూ ఐకమత్యంగా ఒక గ్రూపుగా ఏర్పడి రూపాయి రూపాయి జమ చేసుకున్నప్పుడే ఆ గ్రూపు అన్ని రంగాల్లో ఆర్థిక పురోగాభివృద్ధి సాధిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.ఆదివారం లక్ష్మీగూడ శ్రీలక్ష్మి పొదుపు సంఘం స్వర్ణోత్సవ సర్వసభ్య సమావేశం లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పొదుపులు చేసుకొని జమ చేసుకుంటే వారి అవసరా లకు అవి ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఒక బృందంగా ఏర్పడి సంఘం ఏర్పాటు చేసుకొని తక్కువ వడ్డీలకు అప్పులు తీసుకొని అభివృద్ధి చెందడానికి వీలుంటుందని అన్నారు. పొదుపు చేసుకొని ఉంటే ఆ సంఘం పది రెట్లు కలిపి రుణాలు మంజూరు చేస్తారని, రుణాలు తీసుకొని కుటుంబ అవసరాలను తీర్చుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ప్రైవేట్ ఫైనాన్స్‌లపై ఆధారపడకుండా అతి తక్కువ వడ్డీలకు సంఘాలలో అప్పులు తీసుకోవచ్చని పేర్కొన్నారు. పొదుపు సంఘాలలో రాష్ట్రంలోనే రాజేంద్రనగర్ పదో స్థానంలో ఉన్నారని తెలిపారు. సంఘ కార్యదర్శి డి రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, 1974లో 39 మంది సభ్యులతో ఈ సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేడు 400 మంది సభ్యులు ఉన్నారని రూ. 9 కోట్ల పొదుపు లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. సంస్థకు 20 కోట్ల ఆస్తులు ఉన్నాయన్నారు . సంఘంలో సభ్యులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు 25వేల రూపాయలను దహన సంస్కారాల కోసం ఉచితంగా అందజేస్తున్నామన్నారు. 60 సంవత్సరాలు పైబడిన సభ్యులకు నెలకు రూ. 2 వేల రూపాయలు చొప్పున పెన్షన్లు ఇస్తున్నామన్నారు.ఈ సమావేశంలో శ్రీ లక్ష్మీ పొదుపు సంఘం అధ్యక్షుడు సందమౌని రఘుపతి ముదిరాజ్, ఉపాధ్యక్షుడు సి.రాజుముదిరాజ్ , సంయుక్త కార్యదర్శి జి.కుమార్, కార్యదర్శి ఏ.మాణిక్యం రెడ్డి,అనసూయ,డి.సికిందర్, కె.జగదీష్,ఎంపీ. వేణుగోపాల్, సిహెచ్.ప్రవీణ్, సంఘం సభ్యులు,ప్రతినిధులు,బస్తీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 11న శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవం

సిద్ధిపేట, జూన్9(ప్రభాత ఉదయం) సిద్దిపేట జిల్లాలోని ములుగు ప్రధాన కేంద్రంలో గల శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవానికి సిద్ధమవుతుంది. ఈ స్నాతకోత్సవం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో జరగనుండగా, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి ముఖ్యఅతిథిగా రానున్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ స్నాత కోత్సవానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత A.P పునర్వ్యవస్థీకరణ చట్టం-2014, 13వ షెడ్యూల్ ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం 23.12.2024 న ఉనికిలోకి వచ్చింది. ఉద్యాన బోధన, పరిశోధన , విస్తరణ విభాగాలలో విశ్వవిద్యాలయం పనిచేస్తుంది. విశ్వవిద్యాలయం పరిధిలో మూడు (3) ఉద్యాన కళాశాలలు, మూడు (3) ఉద్యాన పాలిటెక్నిక్‌లు, పదకొండు (11) ఉద్యాన పరిశోధనా కేంద్రాలు మరియు ఒక (1) కృషి విజ్ఞాన కేంద్రం ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మల్యాల్లో హార్టికల్చర్‌లో %UG% ప్రోగ్రామ్ కోసం హార్టికల్చర్ కాలేజ్, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలు 2023 లో ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త కళాశాలలు.

ఈ విశ్వవిద్యాలయం విద్యార్థులను B.Scలో (ఆనర్స్) హార్టికల్చర్, M.Sc. (హార్టికల్చర్) మరియు Ph.D. (హార్టికల్చర్)లలో అడ్మిషన్లు తీసుకుంటుంది. పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (M.Sc. & Ph.D) లో (i) ఫ్లోరికల్చర్, ల్యాండ్ స్కేపింగ్ (ii) ఫ్రూట్ సైన్స్ (iii) ప్లాంటేషన్, సుగంధ ద్రవ్యాలు, ఔషధ, సుగంధ పంటలు (iv) వెజిటబుల్ సైన్స్‌లో స్పెషలైజేషన్ కలిగి ఉంది. డిప్లొమా హార్టికల్చర్‌లో 200, B.Sc (ఆనర్స్) హార్టికల్చర్‌లో 296, M.Scలో42, Ph.D హార్టికల్చర్‌లో 9 విశ్వవిద్యాలయం విద్యార్థులను వార్షికంగా తీసుకుని సామర్థ్యం. యూనివర్సిటీ చట్టం మరియు చట్టాలను సవరించడం ద్వారా సిద్దిపేట జిల్లాలోని ములుగు లో ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (FCRI) కళాశాల మరియు రెండు ప్రైవేట్ హార్టికల్చర్ పాలిటెక్నిక్‌లకు విశ్వవిద్యాలయం అనుబంధ హోదాను కల్పించింది. ఫారెస్ట్ కాలేజ్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ లో 4 సంవత్సరాల అటవీ విద్యను B.Sc ద్వారా అందిస్తుంది. ఫారెస్ట్రీ హానర్స్ ఇన్‌టేక్ కెపాసిటీ 65, PG ప్రోగ్రామ్‌లు, 2 సంవత్సరాల M.Sc లో 24 మందితో అటవీ శాస్త్రం లో ఉండగా, Ph.D ను 2022 నుండి ఫారెస్ట్ లో ప్రారంభించబడింది. ఫారెస్ట్రీ యొక్క నాలుగు విభాగాలలో 14 మందిని i) సిల్వికల్చర్ మరియు అగ్రోఫారెస్ట్రీ ii) ఫారెస్ట్ బయాలజీ మరియు ట్రీ ఇంప్రూవ్‌మెంట్ iii) అటవీ ఉత్పత్తులు మరియు వినియోగం మరియు iv) అటవీ వనరుల నిర్వహణలో అడ్మిషన్లు తీసుకుంటుంది.



ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజ ప్రభాకర్

ఇంకా, విశ్వవిద్యాలయం తన పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ను 2022-23 నుండి సిద్దిపేట జిల్లాలోని ములుగులో పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ (PGIHS)లో ప్రారంభించింది. విశ్వవిద్యాలయం విద్యార్థుల పరిశోధన అధ్యయనాలను నిర్వహించడానికి 80 ఎకరాల సాగు భూమిని సేకరించింది. విశ్వవిద్యాలయం యొక్క చెప్పుకోదగ్గ విజయం: న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ICAR) చేత ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల అక్రిడేషన్ సాధించింది. అలాగే B.Sc (ఆనర్స్) హార్టికల్చర్, M.Sc. (హార్టికల్చర్) మరియు పిహెచ్‌డి (హార్టికల్చర్) నాలుగు విభాగాలలో గుర్తింపు సాధించింది. తెలంగాణలోని నల్గొండ జిల్లా అయిటిపాముల బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీ నుండి ఓరియంటల్ పిక్లింగ్ మెలోన్ కు గాను నల్గొండ దోసకాయ కు రైతు వంగడం గా గుర్తింపు కోసం ఢిల్లీలోని ప్రొటెక్షన్ ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్ రైట్స్ నమోదుకు విశ్వవిద్యాలయం ఫెసిలిటేటర్‌గా వ్యవహరించింది. ఒక్కొక్కటి ఒక హెక్టారులో మోడల్ గార్డెన్‌లుగా KVK, రామగిరిఖిల్లా , మోజెర్లలోని ఉద్యాన కళాశాల పరిధిలోని మదనాపురం వ్యవసాయ క్షేత్రంలో ట్రయాంగిల్ అలాగే స్క్వేర్ సిస్టమ్ రెండింటిలోనూ ఆయిల్ పామ్ గార్డెన్‌ను నెలకొల్పారు.

పసుపు, అల్లం లలో సేంద్రీయ పసుపు ఉత్పత్తి సాంకేతికతలో నర్సరీ విత్తనాలను పెంచే సాంకేతికతను ప్రామాణిక ప్రామాణికరించింది. RKVY ఆధ్వర్యంలో డ్రై ఫ్లవర్ టెక్నాలజీని అభివృద్ధి చేసి ఆంగ్లంలో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. రాష్ట్రంలోని ఉద్యాన రైతుల ప్రయోజనం కోసం "ఉద్యాన దర్శిని-2023-24"ని వివరమైన అభ్యాసాల ప్యాకేజీతో తెలుగులో ప్రచురించింది. ఈ ప్రచురాన్ని రైతులకు తక్కువ ధరలోనే అందిస్తుంది.

సమీప భవిష్యత్తులో మరో రెండు కొత్త పరిశోధనా కేంద్రాలు/కేంద్రాలను నెలకొల్పడం విశ్వవిద్యాలయం లక్ష్యంగా పెట్టుకుంది. సంగారెడ్డిలోని పండ్ల పరిశోధన స్థానం లో బంగాళదుంప కోసం AICRP ఉప కేంద్రం, నర్సంపేటలోని మిర్చి & విత్తన సుగంధ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయడానికి నివేదికలు తయారు చేయబడ్డాయి.

### ముఖ్య అతిథిగా తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్

తమిళనాడులోని కోయంబత్తూర్ ప్రధాన కేంద్రంగా గల తమిళనాడు



సిద్దిపేట జిల్లా ములుగులోని ఉద్యాన విశ్వవిద్యాలయం భవనం

వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ గీతాలక్ష్మి వెల్లింగిరి ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా రానున్నారు.

డాక్టర్ గీత లక్ష్మీ తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ హోదాలలో 32 సంవత్సరాలకు పైగా పనిచేశారు. వ్యవసాయ వాతావరణ శాస్త్రంలో ఆమె నిష్ణాతురాలు. డా.వి.గీతాలక్ష్మి ఆస్ట్రేలియా, యుకె, యుఎస్, ఇజ్రాయెల్ మరియు జపాన్‌లోని ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలలో వాతావరణ అంచనా, వాతావరణ నమూనా, వాతావరణ మార్పు మరియు వాతావరణాన్ని తట్టుకునే సాంకేతికత అభివృద్ధి రంగాలలో పోస్ట్ డాక్టోరల్ శిక్షణ పొందారు. డాక్టర్ గీతాలక్ష్మి ప్రపంచంలోని ఐదు ఖండాల్లోని 40 ప్రతిష్టాత్మక సంస్థలతో పరిశోధన సహకారాన్ని అందించారు. రూ. 59 కోట్ల రూపాయల విలువైన 23 బాహ్య ఏజెన్సీ నిధులతో పరిశోధన ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారు. తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎనిమిది అగ్రిబిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్‌లను ప్రోత్సహించడంలో ఆమె కీలకపాత్ర పోషించారు.

రైతుల ప్రయోజనం కోసం 2023లో వరి, పప్పుధాన్యాలు, మినుములు, నూనెగింజలు, చెరకు, ఎండు జనపనార, ఉద్యానవన మరియు అటవీ చెట్లతో సహా ప్రధాన పంటలలో 10 కొత్త సాంకేతికతలు, ఆరు వ్యవసాయ పనిముట్లు మరియు 23 మెరుగైన పంట రకాలను విడుదల ఆమె విడుదల చేశారు. జాతీయ అంతర్జాతీయ పీర్ రివ్యూడ్ జర్నల్స్‌లో 120 పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. అదేవిధంగా 11 పుస్తకాలు, 36 పుస్తక అధ్యాయాలను రచించారు. డాక్టర్ గీతాలక్ష్మి 21 అవార్డులను కైవసం చేసుకున్నారు.ఆమె అత్యంత ప్రతిష్టాత్మక ఇండియన్ మెటీరోలాజికల్ సొసైటీ నుండి "ఇండియన్ మెటీరోలాజికల్ సొసైటీ ఫెలో" అవార్డును అందుకున్నారు.

### విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం

ఈ మూడవ స్నాతకోత్సవంలో 156 మంది కి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆర్గుకి పీహెచ్డీ డాక్టరేట్ పట్టాలు ప్రధానం చేయనున్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బి.ఎస్ సంతోష్

## జిల్లాలో గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతం

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9(ప్రభాత ఉదయం)జిల్లా వ్యాప్తంగా ఉన్న 14 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. ఆదివారం గద్వాలలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల కేంద్రాల్లో గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అపూర్వ చౌహాన్ తో కలిసి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో ఎంత మంది అభ్యర్థులు హాజరైనారు, గైర్హాజరు ఆయన వారి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి ప్రశ్నాపత్రాల బుక్ లెట్స్, ఓఎంఆర్ షీట్స్ ను నిబంధనల ప్రకారం జాగ్రత్తగా సీల్ చేయాలన్నారు. పరీక్ష ప్రారంభానికి ముందే బయోమెట్రిక్ హాజరును పక్కాగా తీసుకున్నారో లేదోనని అడిగారు. ఏ ఒక్క అభ్యర్థి సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష హాల్లోకి తీసుకెళ్లకుండా పక్కాగా తనిఖీ చేసినట్లు అక్కడి అధికారులు కలెక్టర్ కు తెలిపారు. మిగిలిన ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్స్, జవాబు పత్రాలను నిబంధనల ప్రకారం నిర్దేశించిన పెట్టెలలో సీల్ చేయాలని, రూట్ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనంలో టీజీపీఎస్సీకి పంపనున్నట్లు పరీక్షల జిల్లా సమన్వయకర్త రామ్మోహన్ వివరించారు. మొత్తం 5234 మంది జిల్లాలో పరీక్ష రాయవలసి ఉండగా 4200 మంది పరీక్షలకు హాజరయ్యారని, 1034 మంది గైర్హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో డిపార్ట్మెంట్ అధికారితో పాటు అబ్జర్వర్లు విధులు నిర్వహించారన్నారు. నలుగురు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ముగ్గురు రూట్ అధికారులు, 51 మంది ఇతర అధికారులు పరీక్షలు సజావుగా జరిగేందుకు తమ బాధ్యతలు నిర్వర్తించినట్లు చెప్పారు.




## హమాలీ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టం తీసుకురావాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9(ప్రభాత ఉదయం) అడ్డాలపై పనిచేసే హామాలీల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టం తీసుకొచ్చి వారి సంక్షేమానికి పాటుపడాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ. వెంకటస్వామి అన్నారు, ఆదివారం గద్వాల లోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హమాలీ కార్మికుల జనరల్ బాడి సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలు నిత్యం నిర్మాణ రంగంలో వస్తు సేవల రవాణాలో వివిధ రకాల ఉత్పత్తి ప్రక్రియలో క్రియాశీలక పాత్రను పోషిస్తూ తమ శ్రమను చెమటను ధారపోసి సంపదను పెంచుతున్నారని అన్నారు. అటువంటి హమాలీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడం,వారి రక్షణ కోసం ఏటువంటి చట్టాలను తీసుకురాకపోవడం బాధాకరమన్నారు. వివిధ రకాల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ పథకాలు కూడా వీరికి దరి చేరడం లేదన్నారు. ప్రజలకు కావలసిన అన్ని రకాల సేవలు అందించే హమాలీ కార్మికులకు మాత్రం నిలువ నీడ లేదని అవేదన వ్యక్తం చేశారు అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీల కోసం వారికి పని ప్రదేశాలలో సేద తీరడానికి ప్రత్యేక అడ్డాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాల పైబడిన ప్రతి హమాలీకి ప్రభుత్వమే పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో గాయపడిన కార్మికులకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని హమాలీ కార్మికులకు పిఎఫ్ ఈయస్ఐ సౌకర్యం కల్పించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలలో తొలి ప్రాధాన్యం హమాలీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేర్ నరసింహ, హమాలీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు రంగన్న, బాలకృష్ణ, నాయకులు రఘు, లక్ష్మన్న,రామకృష్ణ, గజేంద్ర, కళ్యాణ్, వీరేష్, నరసింహ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష పూర్తి

### పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఐఏఎస్.

మొయినాబాద్,జూన్ 09 (ప్రభాత ఉదయం) మండలంలోని తొమ్మిది పరీక్ష కేంద్రాలలో ఈ రోజు గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 5928 అభ్యర్థులకు గాను 3888 మంది అనగా 65.58%హాజరయ్యారు.జేబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో గల రెండు పరీక్ష కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్ స్థానిక తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్, రీజినల్ కోఆర్డినేటర్ రామ్మోహన్ లతో కలిసి పరిశీలించారు.పరీక్ష కేంద్రాలలో ఈ సారి ప్రతి అభ్యర్థి యొక్క బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసారు.చేవెళ్ల ఏసీపీ శ్రీ బి.కిషన్ , స్థానిక ఇన్స్పెక్టర్ శ్రీ పవన్ కుమార్ రెడ్డితో కలిసి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రమాదకరంగా పద్మారం రోడ్డు

## పద్మారం రోడ్డు యమ డేంజర్

### ప్రయాణికులకు పొంచిఉన్న పెను ప్రమాదం
### పద్మారం, గాలిగూడ వెళ్లే గ్రామస్తులకు తప్పని కష్టాలు
### రోడ్డుకు ఇరువైపులా కొట్టుకుపోయిన మట్టి
### పట్టించుకోని అధికారులు నాయకులు
### రోడ్డు మరమ్మతులు చేపట్టలని కోరుతున్న పద్మారం గ్రామస్తులు
### పద్మారం నుంచి బోయగూడకు వెళ్లే దారి సైతం అద్వాన్నం

షాద్ నగర్, జూన్9(ప్రభాత ఉదయం) రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరి గూడ మండలంలోని పద్మారం గాలిగూడ వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డు మార్గం కోతకు గురై ధ్వంసం అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పద్మరం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లేడ్ చౌదరి గూడ నుండి గాలిగూడ ,వీరన్న పేట,పద్మరం వెళ్లాలంటే రోడ్డుకు ఇరువైపులా మట్టి వర్షానికి కొట్టుకుపోయి పెద్ద ఎత్తున గండి పడ్డాయి. పరిసర ప్రాంతాల ప్రజలు కొత్త వాహనాలు వస్తే రాత్రిపూట ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రజా ప్రతినిధులు కేవలం ఓట్ల సమయంలోనే గ్రామాల అభివృద్ధిపై భూటకాపు హామీలు ఇస్తూ పబ్బం గడుపుతున్నారు తప్ప రోడ్డుకు ఇరువైపులా శాశ్వత పరిష్కారం కోసం ఎవ్వరు పట్టించు కోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అద్వాన్నంగా పద్మారం నుంచి బోయగూడ రోడ్డు... వర్షాకాలంలో ఎక్కువ వర్షాలు కురుస్తే పద్మారం నుంచి బోయగుడకి వెళ్లే రోడ్డు తీవ్ర అద్వాన్నంగా మారుతుంది. గతంలో కల్వర్టు లేకపోవడం వల్ల వరదదాటికి రోడ్డంతా తెగిపోయి రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో పద్మారంతో పాటు బోయగుడ గ్రామస్తులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే గత ఏడాది ప్రణాళిక బద్ధంగా కల్వర్టును నిర్మించక పోవడం వల్ల కల్వర్టు సమీపంలోని రోడ్డుకు ఇరువైపులా మట్టి కొట్టుకుపోయి ప్రమాదాన్ని పొంచి ఉందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు సమీపంలో తెగిపోయిన రోడ్డుకు మరమ్మతులు చేయడంతో పాటు గుంతలు పడిన చోట రోడ్డు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండ చూడాలని ప్రజలుఅధికారులను కోరుతున్నారు.



## సర్వాయి పాపన్న జాతీయ అవార్డుకు ఎంపికైన తాళ్ల శ్రీశైలంగౌడ్

### మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తా

మొయినాబాద్ ,జూన్,09 (ప్రభాత ఉదయం) సర్దార్ సర్వాయి పాపన్న జాతీయ అవార్డు 2024 సెలక్షన్లో రంగారెడ్డి జిల్లా కల్లు వృత్తిదారుల చైర్మన్ తాళ్ల శ్రీశైలంగౌడ్ నియమితులైయ్యారు. ఈ సందర్భంగా నగరంలో ఆయనకు బహుజన సాహిత్య అకాడామీ జాతీయ చైర్మన్ నల్లారాధాకృష్ణ, రాష్ట్ర సెలక్టెడ్ కమిటి సభ్యుడు డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ తాళ్ల శ్రీశైలంగౌడ్కు అవార్డు, నియామకపత్రాన్ని అందజేశారు. తాళ్ల శ్రీశైలంగౌడ్ గత 40 సంవత్సరాలుగా కల్లు గీత వృత్తిదారుల సమస్యలపై పోరాటం చేస్తూ జిల్లా వ్యాప్తంగా కల్లు వృత్తిదారులకు లైసెన్సు లేని చోట టిఎస్టి టిటిసిఎస్ ఇప్పిస్తు గీత కార్మికుల సమస్యలపై ఎన్నో ధర్నాలు, రాస్తా రోకోలు బహుజనులంతా ఐక్యంగా ఉండాలని ఎస్సీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలను ఐక్యం చేస్తూ కల్లు వృత్తిదారులకు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ జిల్లా చైర్మన్ తాళ్ల శ్రీశైలంగౌడ్ నిలిచారని తెలిపారు. జిల్లాలోని శేరిగూడ ప్రాంతానికి చెందిన ఆయన అనేక ప్రాంతాలలో శ్రీ సర్వాయి పాపన్న విగ్రహాల ఏర్పాటు చేస్తూ అన్ని వర్ణాలను కలుపుకొని ఆయా గ్రామాలలో ఉచిత మెడికల్ క్యాంప్లు నిర్వహిస్తు, అనేక రకాల సమాజిక ఉద్యమాలు చేస్తున్నందుకు 2024 సంవత్సరానికి సమాజ సేవ చేసినందుకు ఆయనను గుర్తించి బహుజన సాహిత్య అకాడామీ ద్వారా జాతీయ అవార్డును అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డులో హైదరాబాద్ లోని బహుజన సామాజిక ఉద్యమాలు చేస్తున్నందుకు 2024 సంవత్సరానికి తాళ్ల శ్రీశైలంగౌడ్ సమాజ సేవ చేసినందుకు గాను గుర్తించి ఈ అవార్డును అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డును పొందిన రంగారెడ్డిజిల్లా కల్లు గీత కార్మికుల సంఘం చైర్మన్ తాళ్ల శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... ఈ సంవత్సరం జూన్ 10న మహారాష్ట్రల్లోని పుణ్యెలో నిర్వహించే బహుజన రైటర్న్ 4వ సమావేశం సందర్భంగా సర్వాయి పాపన్న జాతీయ అవార్డును సన్మాన కార్యక్రమం నిర్వహించేందుకు ఆహ్వానించినట్లు తెలిపారు. వెస్టర్న్ ఇండియాలోని అనింక్లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, గోవా రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది డెలిగేట్స్ హజరవుతారని తెలిపారు. ముఖ్యంగా జూన్ 10వ తేదీన తన జన్మదినం రోజు కావడం జాతీయ అవార్డు పురస్కారం సన్మాన కార్యక్రమం జరగడం నాకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం సమాజ సేవల్లో మరింత కృషి చేస్తూ సేవ్లా కార్యక్రమాలను నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

### ఆలస్యంగా వెళ్లిన అభ్యర్థులకు నో ఎంట్రీ

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 9(ప్రభాత ఉదయం)జిల్లా వ్యాప్తంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభమై ఒంటి గంటకు ముగిసింది. ఎగ్జామ్ సెంటర్‌లోకి పంపేముందు హాల్‌టికెట్, అభ్యర్థుల ఐడీ కార్డులను నిశితంగా పరిశీలించారు. ఉదయం 10 గంటల వరకే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించిన నేపథ్యంలో అభ్యర్థులను ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఒక్కో అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే సిబ్బంది ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతించారు. జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 5,234 మంది అభ్యర్థులు పరీక్ష రాయవలసి ఉండగా 4,200 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకాగ,1034 మంది గైర్హాజరయ్యారు. గ్రూప్ 1 పరీక్ష నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.





Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.